మరుగుదొడ్ల నిర్వహణలో భారీ అవినీతి

- ఓ టీడీపీ నేతకు నెలకు రూ.లక్షల్లో ఆదాయం: డెప్యూటీ మేయర్ వజ్రబాబు
- ఈ అంశంపై టీడీపీ, వైఎస్సార్ సీపీ మధ్య వాగ్వివాదం
- ఇంజినీరింగ్ విభాగంలో గందరగోళం పై సభ్యుల అసంతృప్తి
- బూజు పట్టిన స్వీట్స్ పంపిణీపై దుమారం
- సుదీర్ఘంగా సాగిన రెండో రోజు కౌన్సిల్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో మరుగుదొడ్ల నిర్వహణలో భారీ స్థాయిలో అవినీతి జరుగుతోందని, ఓ టీడీపీ నేతకు నెలకు రూ.50 లక్షల వరకు ఆదాయం సమకూరుతోందని డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు ఆరోపించారు. శనివారం వాయిదా పడిన కౌన్సిల్ సమావేశం మంగళవారం రెండో రోజు సుదీర్ఘంగా సాగింది. సమావేశానికి మేయర్ కావటి మనోహర్‌నాయుడు అధ్యక్షత వహించారు. బాలవజ్రబాబు మాట్లాడుతూ బీఓటీ(బిల్డ్ ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్) పేరుతో లీజు తీసుకుని ఆదాయం పొందుతున్నారని చెప్పారు. పూర్తి ఆధారాలు నా వద్ద ఉన్నాయని అధికారులకు అప్పగిస్తానని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వ్యాఖ్యలకు నిరసనగా టీడీపీ కార్పొరేటర్లు డెప్యూటీ మేయర్ పైకి దూసుకొచ్చే ప్రయత్నం చేశారు. దీంతో వైఎస్సార్ సీపీ, టీడీపీ సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. టీడీపీ కార్పొరేటర్ కోవెలమూడి నాని మాట్లాడుతూ పీవీకే నాయుడు మార్కెట్‌లో అనధికారికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, ఆ డబ్బులు ఎవరూ తీసుకుంటున్నారో చెప్పాలని అధికారులను ప్రశ్నించారు.


సమావేశానికి అధ్యక్షత వహిస్తున్న మేయర్ కావటి

ఇంజినీరింగ్ సెక్షన్‌లో గందరగోళం..

ఇంజినీరింగ్ సెక్షన్‌లో ఎవరు ఎక్కడ పనిచేస్తున్నారో ఎవరికి తెలియని పరిస్థితి నెలకొందని టీడీపీ కార్పొరేటర్ శ్రీరామ్‌ప్రసాద్ ఆరోపించారు. రెండేళ్లుగా దాదాపు 95 సిబ్బందిని అనధికారికంగా విధుల్లోకి తీసుకున్నారని వారిని ఏ ప్రతిపాదికన తీసుకున్నారో కౌన్సిల్‌కు తెలియజేయాలి కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి, రోషన్ పట్టుబట్టారు.

సర్వే రిపోర్టుపై రగడ..

గతంలో నగరపాలక సంస్థ ద్వారా సర్వే రిపోర్టు జారీ చేసే వారని కాని ఇప్పుడు ఇవ్వడం లేదని కార్పొరేటర్ కోవెలమూడి నాని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన మేయర్, టౌన్ ప్లానింగ్ అధికారులు కొత్త రూల్స్ తీసుకొచ్చి సర్వే రిపోర్టు ఇవ్వడం లేదని, త్వరలో దీనిపై చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదే విధంగా 40 రోజులకొకసారి కౌన్సిల్ నిర్వహించేందుకు సభ్యుల ఏకగ్రీవ తీర్మానాన్ని మేయర్‌కు అందజేశారు. ఎన్టీఆర్ స్టేడియంలో సభ్యుల సభ్యత్వానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

టీడీఆర్ బాండ్ల జారీలో కావాలనే జాప్యం..

ఏటీ అగ్రహారం రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించిన ఇళ్లకు టీడీఆర్ బాండ్లు జారీ చేశారని.. కాని తొలగించిన నా ఇంటికి మాత్రం అధికారులు టీడీఆర్ బాండ్లు కావాలనే ఉద్దేశపూర్వకంగా ఇవ్వలేదని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి అధికారులపై తీరుపై మండిపడ్డారు. స్పందించిన సిటీ ప్లానర్ సదరు స్థలం అర్బన్ ల్యాండ్ సీలింగ్‌లో ఉందని చెప్పడంతో... స్పందించిన వెంకటరెడ్డి సదరు స్థలం యూఎల్‌సీ ల్యాండింగ్ అని తేలితే నేనే స్వయంగా ప్రభుత్వానికి రాసిస్తానని చెప్పారు.

ఆదాయం పెంచే మార్గాలు అన్వేషించాలి



నగరపాలక సంస్థ రెవెన్యూ ఆదాయం పెంచే మార్గాలను అధికారులు అన్వేషించాలని విజ్ఞప్తి చేశారు. సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేసుకుంటూ ఆదాయ వనరులపై దృష్టి సారించాలని సూచించారు.

–చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్సీ

బూజు పట్టిన స్వీట్ల పంపిణీపై దుమారం

కౌన్సిల్ సభ్యులకు ఇచ్చే స్వీట్, స్నాక్స్ బూజు పట్టిందంటూ టీడీపీ కార్పొరేటర్ ఎస్.బాలాజీ మేయర్ దృష్టి తీసుకొచ్చారు. దీనిపై కొంత సేపు కౌన్సిల్‌లో దుమారం రేగింది. స్పందించిన కమిషనర్ పులి శ్రీనివాసులు స్వీట్స్ బూజు పట్టిన విషయంపై సదరు స్వీట్ షాపులో తనిఖీలు నిర్వహించి నివేదిక ఇవ్వాలని ప్రజారోగ్యధికారులను ఆదేశించారు.

అధికారుల తీరుపై కమిషనర్ ఆగ్రహం

సంజీవయ్యనగర్ రైల్వే గేటు నుంచి ఆదిత్య నగర్ 1వలైను వరకు గతంలో మంజూరైన అభివృద్ధి పనులకు సంబంధించి సగం పనులు పూర్తయినా మిగిలిన పనులు పూర్తి చేయడం లేదంటూ స్థానిక కార్పొరేటర్ మల్లవరపు రమ్య ప్రశ్నించడంతో అధికారులు దాటవేత ధోరణితో సమాధానం చెప్పడంతో కమిషనర్ పులి శ్రీనివాసులు మండిపడ్డారు. సభ్యులకు సమాధానం పిచ్చి పిచ్చిగా చెప్పకండి గతంలో మంజూరైన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

కేంద్ర మంత్రి చంద్రశేఖర్‌ని కలిసిన దర్శకుడు



నగరంపాలెం: కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్‌ను బృందావన్‌గార్డెన్‌లోని ఆయన కార్యాలయంలో చిత్ర దర్శకుడు నర్రా శివనాగు సోమవారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిశారు. నేషనల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రెడ్ బుక్(షాడో టీం) చిత్ర విశేషాలను కేంద్ర సహాయ మంత్రి దృష్టికి దర్శకుడు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా దర్శకుడు శివనాగు మాట్లాడుతూ 25 ఏళ్ల సినీ ప్రస్థానంలో 18 చిత్రాలకు దర్శకత్వం వహించానని అన్నారు. ఈతరం నెహ్రూ, దేవినేని(విజయవాడ సింహం) వంటి రాజకీయ చిత్రాలకు దర్శకత్వం వహించినట్లు తెలిపారు. అక్టోబర్‌లో చిత్రాన్ని ప్రారంభించి, మూడు షెడ్యూల్లో పూర్తిచేసి జనవరిలో విడుదల చేస్తామని అన్నారు.

రేపు 'చిరుజల్లులు- సినీ సంగీత విభావరి'

నగరంపాలెం: పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకల్లో భాగంగా 'చిరుజల్లులు – సినీ సంగీత విభావరి' గురువారం నిర్వహించనున్నట్లు ఆర్ఎస్ ఈవెంట్స్ వ్యవస్థాపకురాలు మునిపల్లె రమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్నర్‌రింగ్‌రోడ్‌లోని శిల్పారామంలో సాయంత్రం విభావరి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

ప్రసన్నాంజనేయునికి లక్ష తమలపాకులతో అర్చన



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రముఖ సినీ నటుడు మెగా స్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో మంగళవారం పొన్నూరులోని శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో లక్ష తమలపాకులతో ఆకు పూజ, వేద పండితులతో నిర్వహించారు. సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు మేకల రవీంద్రబాబు మాట్లాడారు. కార్యక్రమంలో చిరంజీవి యువత ప్రతినిధులు రమణస్వామి, జనసేన నాయకులు మాదాసు అప్పారావు, కోట నాంచారయ్య, వి. వెంకటేశ్వర్లు, చిరు అభిమానులు వై.నాయుడు, నాగరాజు, మాదా కళ్యాణ్ చక్రవర్తి కిషోర్, సుధాకర్, గరికపాటి రామ్మోహనరావు, శ్రీను, రామకృష్ణ పాల్గొన్నారు.

108 కిలోల కుంకుమతో విశేష పూజలు



నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట అష్టలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో శ్రావణ మాస కోటి కుంకుమార్చన మహోత్సవాలలో భాగంగా మూడో మంగళవారం గోపూజ, శ్రీ చక్ర మేరుకు విశేష అభిషేకార్చనలు జరిగాయి. 108 కిలోల కుంకుమతో విశేష పూజలు నిర్వహించారు. స్థానిక సిద్ధార్థనగర్ శ్రీకనకమహాలక్ష్మీ మందిరంలో శ్రావణ మాస పూజల సందర్భంగా మూడో మంగళవారం కనకమహాలక్ష్మీ అమ్మవారిని మంగళగౌరిగా అలంకరించారు.

వేమవరపు వెంకటేశ్వర్లుకు నివాళి

నెహ్రూనగర్: రజక సమాజ శ్రేయస్సు తన జీవిత కాలం పోరాటం చేసిన పోరాట యోధుడు వేమవరపు వెంకటేశ్వర్లు అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వెంకటేశ్వర్లు 15వ వర్ధంతిని పురస్కరించుకుని కాకుమాను వారితోటలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైకోర్టు న్యాయవాది వై.కోటేశ్వరరావు(వై కే) మాట్లాడుతూ రజకుల అభివృద్ధికి వెంకటేశ్వర్లు విశేష కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో జీఆర్ భగత్ సింగ్, ఈమని ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్థిక నిర్వహణ, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్థిక నిర్వహణ, నాయకత్వ లక్షణాలతో విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదగాలని భవ డెవలపర్స్ అధినేత శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో మంగళవారం ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఎంబీఏ అంటే వ్యవస్థాపక ధోరణితో విద్యను అభ్యసించడం అని, మంచి వ్యవస్థాపకునిగా ఎదగాలంటే నేతృత్వ నైపుణ్యం, ఆర్థిక నిర్వహణ, సమస్యలకు పరిష్కారం చూపించే సామర్థ్యం అవసరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ, కళాశాల ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత మాట్లాడారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి వి.చక్రవర్తి, శిక్షణ–ఉపాధి అధికారి చల్లా వైష్ణవి, పరీక్షల విభాగ డైరెక్టర్ వేదవతి, సహాయాచార్యులు డి.కళ్యాణి, బి.అనిత, ఎన్. మణికంఠ పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం



తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని కుంచనపల్లిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర జాతీయ నాణ్యత ప్రమాణాల హామీ పరిశీలన, తనిఖీ బృందం మంగళవారం సందర్శించింది. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి, ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవలను, ప్రతి విభాగంలో ఉన్న సదుపాయాలకు వారికి వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ, మలేరియా డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద ప్రపంచ దోమల దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. దోమల ద్వారా వ్యాపించే జబ్బులను అరికట్టేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని, ప్రజలకు ఆరోగ్యసేవలు అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు.



నివాళి: గుంటగ్రౌండ్‌లో వైద్య విద్యార్థిని బొమ్మ వేసి సెల్‌ఫోన్ టార్చ్‌తో నివాళులర్పిస్తున్న గుంటూరు మెడికల్ కళాశాల విద్యార్థులు. -సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

అండర్ గ్రౌండ్ డ్రైనేజీని పటిష్టం చేయాలి

కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థని పటిష్టంగా, ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కమిషనర్ బస్టాండ్ ఎదురు నుంచి ఉన్న యూజీడీ లైన్‌ను, సుద్దపల్లి డొంక రోడ్‌లోని సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, అవుట్ ఫాల్ డ్రైన్‌ను, ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో ప్రస్తుతం తూర్పు నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాల్లో యూజీడీ లైన్లు ఉన్నాయని, వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం సుద్దపల్లి డొంకరోడ్‌లోని యూజీడీ సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ శ్రీధర్, ఎస్ఎస్‌లు రాంబాబు, అయూబ్ ఖాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఐజాక్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కార్మిక సంఘాలు సహకరించాలి..

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న వనరులతో మెరుగైన పారిశుద్ధ్యాన్ని సాధించడానికి నగర ప్రజలతో పాటుగా కార్మిక సంఘాలు కూడా సహకరించి, పరిశుభ్రమైన గుంటూరు నగరం కోసం చేసే కృషిలో భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ప్రజారోగ్య విభాగంలో చేపట్టాల్సిన అంశాలపై వివిధ కార్మిక సంఘాల నాయకులు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, డి.వెంకట లక్ష్మి, ఎంహెచ్ఓ మధుసూదన్, ఎస్.ఈ. శ్యాం సుందర్ పాల్గొన్నారు.

డయల్ 100 ఫోన్ కాల్స్‌కు వెంటనే స్పందించాలి



నగరంపాలెం: డయల్ 100కు వచ్చే ఫోన్ కాల్స్‌కు సత్వరమే స్పందించి, పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవర ణలోని హాల్‌లో మంగళవారం పోలీస్ కంట్రోల్ రూం, క్లూస్ బృందం, ఫింగర్ ప్రింట్స్, హైవే పెట్రోలింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ డయల్ 100కు వచ్చే కాల్స్‌కు స్పందిస్తే బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని అన్నారు. ఏమాత్రం అలసత్వం వహించిన నేరం జరిగేందుకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రతి ఫోన్ కాల్‌కు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని అన్నారు. మహిళల భద్రత, రక్షణకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. వారి నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని అన్నారు. జిల్లాలోని ప్రజలు శుభ, ఇతరత్రా కార్యక్రమాలకు వెళ్లే ముందు తప్పనిసరిగా జిల్లా పోలీస్ కంట్రోల్ రూం 8688831568 నంబర్‌కు తెలియజేయాలని అన్నారు. తిరుగు ప్రయాణమై ఇళ్లకు వచ్చే వరకు లాక్డ్ హౌసింగ్ మోనిటరింగ్ సిస్టం(ఎల్ఎంహెచ్ఎస్)ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. తద్వారా ఇళ్లకు భద్రతగా ఉంటుందని అన్నారు.

వైద్యులకు రక్షణ చట్టాలు అవసరం

- ఎనిమిదో రోజుకు చేరిన జూడాల సమ్మె
- జీజీహెచ్ నుంచి గుంటగ్రౌండ్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ

గుంటూరు మెడికల్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై లైంగిక దాడిని ఖండిస్తూ జీజీహెచ్‌లో ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె మంగవారానికి ఎనిమిదో రోజుకు చేరింది. జూనియర్ వైద్యులు సమ్మె ఎందుకు చేస్తున్నారనే విషయాన్ని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు వివరించి రోగుల ప్రాణాలు రక్షించే తమ ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు జీజీహెచ్ నుంచి నాజ్‌సెంటర్ గుంటగ్రౌండ్ వరకు ప్లకార్డులు చేతబూని నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా వెళ్లారు. ఆస్పత్రుల్లో వైద్యులకు రక్షణ లేకుండా విధులు నిర్వహించలేమని, వైద్యులు, సిబ్బందిపై దాడులు నిలువరించేలా ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. నిందితులను తక్షణమే పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో జూడాల సంఘం నేతలు డాక్టర్ పి.దీక్షిత్, డాక్టర్ అన్వర్‌బాషా, డాక్టర్ రవి, డాక్టర్ నిమ్మి, డాక్టర్ చరణ్, డాక్టర్ మనోజ్ఞ, డాక్టర్ అశ్విని, డాక్టర్ సరిత, హౌస్‌సర్జన్లు బాబి, దీపిక, ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులు మోహన్‌చంద్ర, చరణ్ పాల్గొన్నారు.


జీజీహెచ్‌లో ఎదుట ధర్నా చేస్తున్న వైద్య విద్యార్థులు

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజి వైద్యుల ఘనత

గుంటూరు మెడికల్: కామెర్లు, వొళ్లంతా దురద, పసుపు పచ్చని మూత్రం, తెల్లగా మలవిసర్జన వ్యాధితో బాధపడుతున్న రోగికి గుంటూరు జీజీహెచ్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు రూ.పది లక్షల విలువైన ఆపరేషన్ ఉచితంగా ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా చేశారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం శుశ్రుత హాలులో సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కోటి వెంకటేశ్వరరావుతో కలసి వివరాలను వెల్లడించారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం అమ్మపాలేనికి చెందిన కేతవరపు ఆంధ్రయ్య కామెర్ల వ్యాధితో ఈ నెల 6న జీజీహెచ్‌కు వచ్చారు. వ్యవసాయ కూలిపనులు చేసుకునే ఆంధ్రయ్యకు వివిధ పరీక్షలు చేసి, పాంక్రియాటిక్ క్యాన్సర్ వ్యాధిగా వైద్యులు గుర్తించారు. ఈ ఆపరేషన్ ఎంతో కష్టమైనదని డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. క్లిష్టమైన ఆపరేషన్ ఏడు గంటల పాటు చేసి ఎక్కడ ఇబ్బందులు లేకుండా పేగులను జత చేసుకుంటూ విజయవంతం చేశారన్నారు. ఈ ఆపరేషన్ చేయాలంటే ప్రైవేట్ ఆస్పత్రిలో రూ.పది లక్షలకు పైగా ఖర్చు అవుతుందని ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేశారన్నారు. ఆపరేషన్ చేసిన డాక్టర్ కోటి వెంకటేశ్వరరావు, మత్తు వైద్యులు పోలయ్యను డాక్టర్ కిరణ్‌కుమార్ అభినందించారు.


ఆపరేషన్ చేయించుకున్న ఆంధ్రయ్యతో వైద్యులు

జీజీహెచ్‌లో ఇక మోకీలు ఆపరేషన్లు

- ఉన్నతీ ఫౌండేషన్ సాయంతో ఉచితం
- గతంలో వంద మందికి చికిత్స
- తొలగిపోనున్న మోకీలు బాధితుల కష్టాలు

గుంటూరు మెడికల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల పెద్ద ఆస్పత్రిగా పేరుగడించిన గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి(జీజీహెచ్)లో మోకీలు మార్పిడి ఆపరేషన్లు ఉచితంగా చేసేందుకు రంగం సిద్ధమైంది. సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, ఉన్నతీ ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి ముందుకొచ్చారు. గతంలో వంద ఆపరేషన్లు జీజీహెచ్‌లో చేశారు. కరోనా నేపథ్యంలో ఆగిపోయిన ఆపరేషన్లు మళ్లీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చొరవతో ప్రారంభం కానున్నాయి. ఇటీవల జీజీహెచ్‌లో సమీక్ష చేసిన కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌లకు ఉచిత మోకీలు మార్పిడి ఆపరేషన్‌ల గురించి డాక్టర్ కిరణ్‌కుమార్ వివరించారు. వారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆపరేషన్లు త్వరితగతిన ప్రారంభించి పేదలకు మోకీలు సమస్యలు తొలగించేలా ముగ్గురు వైద్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు.

2007 నుంచి ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు...

బీఎంఆర్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, ఉన్నతీ ఫౌండేషన్‌ను 2007లో డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి ప్రారంభించారు. గుంటూరును జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జీలకు రాజధానిగా చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. గతంలో 20 ఆపరేషన్‌లకు ఉన్నతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా రూ.20 లక్షల ఖరీదు చేసే ఇన్‌ప్లాంట్లు అందించారు. ఇటీవల ఆఫ్రికా ఖండంలోని అంగోల దేశంలో అక్కడి దేశ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సీల్వియా పౌలుటుకుట ఆహ్వానం మేరకు వారం రోజులు పర్యటించి అక్కడి వైద్యులకు రివిజన్ రీప్లేస్‌మెంట్ సర్జరీల్లో శిక్షణ అందించారు. బంగ్లాదేశ్‌తో కూడా ఒప్పందం చేసుకుని వైద్యులకు జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీల్లో శిక్షణ అందిస్తున్నారు. రోబోటిక్ సర్జరీలను గుంటూరు ప్రజలకు చేరువ చేసి ఆధునిక వైద్య సేవలను మెట్రోపాలిటన్ నగరాలకు వెళ్లే పనిలేకుండా గుంటూరులోనే అందిస్తున్నారు.



ఉచితంగా ఆపరేషన్ చేయించుకున్న రోగులతో డాక్టర్ నరేంద్రరెడ్డి, డాక్టర్ ప్రశాంత్ (ఫైల్)

పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవాలనే...



డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మైసూర్‌లో 1994లో ఎంబీబీఎస్, దావనగిరిలో 2003లో ఆర్థోపెడిక్ సర్జరీలో పీజీ పూర్తి చేశారు. హైదరాబాద్ సన్‌షైన్ హాస్పిటల్‌లో 2003–05 వరకు డాక్టర్ గురవారెడ్డి వద్ద తదపరి ఇంగ్లాండ్‌లో 2005లో జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీ ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. పుట్టి పెరిగిన జిల్లా నుంచి ప్రతిరోజూ అధిక సంఖ్యలో వ్యయప్రయాసలతో మోకీలు మార్పిడి ఆపరేషన్ల కోసం వస్తున్న విషయాన్ని గమనించారు. దీంతో గుంటూరులో సాయిభాస్కర్ హాస్పిటల్ ఏర్పాటు చేశారు. హాస్పిటల్ ఏర్పాటు చేసిన మొదట్లో ప్రజలకు జాయింట్ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్లు అంటే చాలా భయంతో పాటుగా పలు అనుమానాలు ఉండేవి. వాటిని తొలగించేందుకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

డాక్టర్ నరేంద్రరెడ్డిసేవలు అభినందనీయం...



మోకీలు నొప్పులు, కీళ్ల అరుగుదల లాంటి సమస్యలతో జీజీహెచ్‌కు వచ్చే పేద ప్రజలకు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి ఉచితంగా ఆపరేషన్లు చేయటం అభినందనీయం. ఆపరేషన్లు ఉచితంగా చేయటంతో పాటుగా సుమారు రూ.20 లక్షల ఖరీదు చేసే ఇంప్లాంట్‌లను ఆయనే తన ట్రస్ట్ ద్వారా పేదలకు ఉచితంగా ఇచ్చారు. ప్రభుత్వం మోకీలు మార్పిడి ఆపరేషన్లు తిరిగి ప్రారంభించేందుకు సిద్ధం అయ్యాం. త్వరలోనే ఉచిత ఆపరేషన్లు ప్రారంభమవుతాయి.

– డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్

కమిటీ కుర్రోళ్లు సందడి



గుంటూరు నగరంలో కమిటీ కుర్రోళ్లు చిత్ర బృందం సందడి చేసింది. మంగళవారం నగరంపాలెం జీటీ రోడ్డులోని ఫినిక్స్‌మాల్ థియేటర్‌లో మ్యాట్నీ షోకు వచ్చారు. చిత్ర బృందానికి థియేటర్, ఫుడ్ కోర్ట్ యాజమాన్యం స్వాగతం పలికింది. తొలుత కమిటీ కుర్రోళ్లుకు సంబంధించి కేక్ కట్ చేశారు. అనంతరం చిత్ర నిర్మాత, నటి కొణిదెల నీహారిక మీడియాతో మాట్లాడుతూ మంచి చిత్రంగా ప్రేక్షకులు ఆదరించారని అన్నారు. మంచి కలెక్షన్లతో విజయవంతంగా ప్రదర్శిస్తుండటం ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఫుడ్ కోర్ట్ యాజమాన్యం దాసరి శ్రీకాంత్, సతీష్, శ్రావణ్, వెంకటేష్ పాల్గొన్నారు. –నగరంపాలెం

• జాతీయ పోటీలకు ముగ్గురు పవర్‌లిఫ్టర్లు

మంగళగిరి: సీనియర్ నేషనల్ మెన్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు గుంటూరు జిల్లా నుంచి ముగ్గురు పవర్‌లిఫ్టర్లు ఎంపికయినట్లు అసోసియేషన్ ప్రతినిధులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని మంగళవారం తెలిపారు. షేక్ సాదియా ఆల్మాస్, 84 కేజీల విభాగంలో బొల్లినేని చంద్రిక, షేక్ షబ్బీనా ఎంపికయినట్లు తెలిపారు.